## క్లుప్తంగా

### అవయవదానానికి ముందుకు రావాలి



రక్తదానం చేస్తున్న యువతీ యువకులు

కర్నూలు(హాస్పిటల్/సెంట్రల్): అవయవదానం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కిమ్స్ హాస్పిటల్స్ కర్నూలు సీఈఓ డాక్టర్ సునీల్ సేపూరి అన్నారు. సర్దార్ భగత్‌సింగ్ 118వ జయంతి సందర్భంగా శనివారం ఏఐవైఎఫ్, కిమ్స్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో సీఆర్ భవన్‌లో మెగా రక్తదాన, అవయవదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని డాక్టర్ సునీల్ సేపూరితో పాటు రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య ప్రారంభించారు. అనంతరం డాక్టర్ సునీల్ సేపూరి మాట్లాడుతూ రక్తదానం, అవయవదానంపై ప్రజల్లో అవగాహన రావాల్సిన అవసరం ఉందన్నారు. కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ మేరకు పేరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవయవదానంతో మరణించిన తర్వాత కూడా ఇతరులను బతికించే అవకాశం ఉంటుందని చెప్పారు. అనంతరం 38 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ అధ్యక్షులు శ్రీనివాసులు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, నగర సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, కిమ్స్ హాస్పిటల్ మార్కెటింగ్ జనరల్ మేనేజర్ ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

### 4వ తేదీన దుర్గామాత విగ్రహాల నిమజ్జనం



దుర్గాఘాట్‌లో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్

కర్నూలు కల్చరల్: దుర్గా మాత విగ్రహాల నిమజ్జనాన్ని అక్టోబర్ 4వ తేదీన నిర్వహిస్తున్నట్లు బీజేపీ నేత టీజీ వెంకటేష్ తెలిపారు. శనివారం తుంగభద్ర నది ఒడ్డున సంకల్‌బాగ్‌లోని దుర్గా ఘాట్‌ను ఆయన సందర్శించారు. నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లను నిమజ్జన కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి ఏటా విగ్రహాల సంఖ్య పెరుగుతూ వస్తుందన్నారు. ఈ ఏడాది కర్నూలు నగరంలో సుమారు వంద దుర్గ మాత విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తున్నారన్నారు. నిమజ్జనాన్ని తిలకించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. నగరంలోని ప్రధాన కూడళ్ల మీదుగా సంకల్ బాగ్‌కు శోభాయాత్రగా విగ్రహాలు నిమజ్జనానికి తరలి రానున్నట్లు చెప్పారు. ఆయన వెంట కమిటీ సభ్యులు దాశెట్టి శ్రీనివాసులు, తిరుపాల్ బాబు, విట్టల్‌శెట్టి, తదితరులు పాల్గొన్నారు.

### మచ్చలేని నాయకుడు కోట్ల

కర్నూలు(సెంట్రల్): రాజకీయాల్లో అవినీతి మచ్చలేని నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డికి దక్కుతుందని కాంగ్రెస్ కర్నూలు నగర అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా పేర్కొన్నారు. శనివారం కోట్ల 24వ వర్ధంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ నాయకులు పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ..ఢిల్లీ రాజకీయాలను శాసించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కరరెడ్డికే దక్కుతుందన్నారు. తన మంత్రివర్గంలో విలువలతో కూడిన రాజకీయాలు చేసే మంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి అని మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ ఓ విలేఖరి అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పిన విధానమే కోట్ల నిజాయితీకి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నాయకులు మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకరబాబు,నాయకులు బతుకన్న, బజారన్న, షేక్ ఖాజా హుస్సేన్, లాజరస్, సుబ్రమణ్యం, సత్యరాజు, కిశోర్, ఆర్.ప్రతాప్ పాల్గొన్నారు.

### మానసిక ఒత్తిడితో పెరుగుతున్న గుండె జబ్బులు

కర్నూలు(హాస్పిటల్): వివిధ వ్యాపకాల కారణంగా మనుషుల్లో మానసిక ఒత్తిడే గుండెజబ్బులు పెరిగేందుకు కారణం అవుతుందని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కార్డియాలజీ విభాగంలో శనివారం వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా మరణాలకు అధిక శాతం గుండె జబ్బులు కారణం అవుతున్నాయని చెప్పారు. వీటిని నియంత్రించేందుకు రెగ్యులర్‌గా వ్యాయామం చేయడం, ధూమ, మద్యపానం మానేయడం, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం అవసరమన్నారు. యోగా, ధ్యానం ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలన్నారు. కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ.. బీపీ, షుగర్, అధిక కొలెస్ట్రాల్, ఒత్తిడి వంటివి గుండె సంబంధిత వ్యాధులకు ప్రధాన కారకాలని తెలిపారు. ముందస్తు పరీక్షల ద్వారా సమయానికి గుర్తించి నియంత్రించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఈ-హాస్పిటల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ శివబాల నాగాంజన్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్, కార్డియాలజీ విభాగ వైద్యులు కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రశాంత్, రాజ్‌కుమార్, రవికిరణ్ పాల్గొన్నారు.

# రక్షణ కవచంలా జగనన్న డిజిటల్ బుక్

- కార్యకర్తలను ఇబ్బందులు పెడితే రెట్టింపు చెల్లింపులు తప్పవు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి
- జగనన్న డిజిటల్ బుక్ క్యూర్ కోడ్ ఆవిష్కరణ



జగనన్న డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య, నేతలు విజయ మనోహరి, సిద్దారెడ్డి రేణుకా, అహమ్మద్ అలీఖాన్ తదితరులు

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో రూపొందించిన డిజిటల్ బుక్.. వైఎస్సార్సీపీ కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలకు రక్షణ కవచంగా నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జగనన్న డిజిటల్ క్యూర్ కోడ్‌ను పార్టీ నేతలతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్యాయానికి గురవుతున్న పార్టీ కార్యకర్తలకు భరోసా కల్పించేందుకు డిజిటల్ బుక్ అందుబాటులోకి తెచ్చారన్నారు. ఈ వివరాలన్ని నేరుగా కేంద్ర కార్యాలయానికి చేరుకుంటాయన్నారు. అక్రమంగా కూటమి నేతలు పోలీసులతో తప్పుడు కేసులు నమోదు చేసినా, బెదిరించినా పార్టీ అండగా ఉంటుందన్నారు. ఇబ్బందులు పెట్టే వారి పేర్లు డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలన్నారు. వచ్చే జగనన్న ప్రభుత్వంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఇబ్బందులు పెట్టే ఎంతటి వారినైనా వదిలేదన్నారు.

- నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. ప్రజలను మోసం చేస్తున్న కూటమి నేతలను ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సోషల్‌మీడియా కార్యకర్తలపై అన్యాయంగా కేసులు నమోదు చేసి జైళ్లకు పంపారన్నారు. మంత్రి లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు.
- పార్టీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు విజయ మనోహరి, జిల్లా అధ్యక్షురాలు సిద్దారెడ్డి రేణుకా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వానికి పరిపాలన చేతకాక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తుందన్నారు. పార్టీ నగర అధ్యక్షులు అహమ్మద్ అలీఖాన్ మాట్లాడుతూ. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు జోలికి వస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రైల్వే ప్రసాద్, పాటిల్ తిరుమలేశ్వర రెడ్డి, కార్పొరేటర్లు విక్రమసింహారెడ్డి, రాజేశ్వర రెడ్డి, షాషావలీ, నగర అధ్యక్షురాలు మంగమ్మ, మాజీ కార్పొరేటర్ నరసింహులు యాదవ్, మైనార్టీ నాయకులు ఫిరోజ్, పార్టీ నాయకులు నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

### హైకోర్టు జడ్జీలను కలసిన కలెక్టర్



హైకోర్టు జడ్జిలతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి.కబర్ధి

కర్నూలు(సెంట్రల్): కర్నూలుకు వచ్చిన హైకోర్టు జడ్జీలు జస్టిస్ బీఎస్ భానుమతి, జస్టిస్ ఎ.హరి హరనాథ శర్మలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, జిల్లా జడ్జి జి.కబర్ధి మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో ఉన్న వారిని కలెక్టర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కలసి జిల్లాలోని పరిస్థితులను వివరించారు.

### నేడు గుర్రం జాషువా జయంత్యుత్సవం

కర్నూలు కల్చరల్: తెలుగు కళా స్రవంతి ఆధ్వర్యంలో మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంత్యుత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలుగు కళా స్రవంతి అధ్యక్షులు ఇనాయతుల్లా తెలిపారు. అష్టావధాని గంగుల నాగరాజు ప్రధాన వక్తగా హాజరై 'జాషువా కవిత్వం – ఒక ఉద్యమం'అనే అంశంపై ఉపన్యసిస్తారని తెలిపారు. మాజీ గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్‌లు కేజీ గంగాధర్‌రెడ్డి, చంద్ర శేఖర కల్కూరా, తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్‌ఆర్కే శర్మ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు. మహమ్మద్ మియ్యా, దండెబోయిన పార్వతీ దేవి జాషువా పద్యగానం చేస్తారని తెలిపారు.



జగనన్న డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పార్టీ నేతలు

## కార్యకర్తలకు అండగా నిలుస్తాం

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రెడ్‌బుక్ రాజ్యాంగంలో అన్యాయమైన కార్యకర్తలకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కార్యకర్తలకు భరోసా కోసమే వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ తీసుకొచ్చారని తెలిపారు. శనివారం తన స్వగృహంలో విలేకరులు సమావేశం నిర్వహించారు. అనంతరం డిజిటల్ బుక్ యాప్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలో చాలా మంది అన్యాయానికి గురయ్యారన్నారు. ఆరాచకాలను ఆపకుంటే వేధింపులకు పాల్పడిన వ్యక్తుల పేర్లు డిజిటల్ బుక్‌లో నమోదవుతాయన్నారు. పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు, గడివేముల, కల్లూరు మండల్లోని కూటమి నేతలు చెప్పారని పోలీసులు అక్రమ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. పోలీసు, రెవెన్యూ, ఇతర అధికారులు తమ ఉద్యోగ ధర్మాన్ని సజావుగా నిర్వర్తించాలన్నారు. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రజలకు మంచి పాలన అందిస్తామన్నారు.

## రేబిస్ వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా రేబిస్ వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దామని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ పిలుపునిచ్చారు. రేబిస్ వ్యాధి వంద శాతం నివారించదగ్గదని, 2030 నాటికి ఈ వ్యాధి మరణాలు సున్నాకు తీసుకురావడమే ప్రపంచ ఆరోగ్య సంస్థ లక్ష్యమన్నారు. శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలో ప్రపంచ రేబిస్ డేను పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుక్కకాటుకు గురైనప్పుడు వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, సామూహిక రేబిస్ టీకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సింధియా శుభప్రద, కమ్యూనిటి మెడిసిన్ విభాగ వైద్యులు రేణుక, ఎలిజబెత్, పుష్పలత, హరిత, లెక్చరర్ సురేష్‌కుమార్, ఎస్ఆర్ యాష్మిన్ తదితరులు పాల్గొన్నారు.

**వాల్‌పోస్టర్ విడుదల..**

జాతీయ రేబిస్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.శాంతిలత తన చాంబర్‌లో అవగాహన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లూయిస్ పాశ్చర్ వర్ధంతి సందర్భంగా రేబిస్ వాక్సిన్‌ను కనుగొన్నందుకు గౌరవంగా ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ యేడాది 'ఇప్పుడే-మీరు, నేను, సమాజం భాగస్వామ్యంతో రేబిస్‌ను నివారిద్దాం' అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ ఉమా, డీఐవో డాక్టర్ నాగప్రసాద్‌బాబు, ఆర్‌బీఎస్‌కే పీఓ డాక్టర్ మహేశ్వరప్రసాద్, ఎస్ఓ హేమసుందరం, డెమో శ్రీనివాసులు శెట్టి, ఎపడమాలజిస్టు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## 6న సర్దార్ నాగప్ప జయంత్యుత్సవం



కరపత్రాలను విడుదల చేస్తున్న ఆహ్వాన కమిటీ నేతలు

కర్నూలు(అర్బన్): భారత స్వాతంత్ర సమరయోధులు సర్దార్ నాగప్ప 115వ జయంతి ఉత్సవాలను ఏపీ బహుజన విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో అక్టోబర్ 6వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆహ్వాన కమిటీ అధ్యక్షులు నక్కలమిట్ట శ్రీనివాసులు, బహుజన విద్యావంతుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు జేవీ కృష్ణయ్య తెలిపారు. శనివారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని కార్యాలయంలో జయంతి ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలుకు చెందిన బహుజన నాయకుడు సర్దార్ నాగప్ప, ఆయన సతీమణి అమరావతమ్మ స్వాతంత్ర పోరాటంలో నిర్వహించిన పాత్ర స్ఫూర్తిదాయకమన్నారు. గాంధీజీ కర్నూలు పర్యటన అనంతరం ఆయన పిలుపుతో ప్రేరణ పొందిన నాగప్ప చదువుకు స్వస్తి చెప్పి ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారన్నారు. వివాహం అనంతరం ఆయన సతీమణి అమరావతమ్మ కూడా సత్యాగ్రహంలో పాల్గొనడమే గాక నిండు చూలాలిగా జైలు జీవితం గడిపి, జైలులోనే బిడ్డను ప్రసవించిందన్నారు. ఇలాంటి గొప్ప త్యాగధనులు, పోరాట పటిమ కలిగిన అరుదైన దేశ భక్తులు మన జిల్లాలో ఉండడం గర్వకారణమన్నారు. ఇలాంటి త్యాగధనులని స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ఈ ఉత్సవాల్లోనే ప్రముఖ రచయిత డీ అజీజ్ రచించిన ' సర్దార్ నాగప్ప ' జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ కూడా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు దాసరి రామశేషయ్య, ప్రధాన కార్యదర్శి పెరికల రంగస్వామి, వర్మ, శివ శంకర్, కరుణాకర్, సర్దార్ నాగప్ప కుమార్తె సర్దార్ విజయలక్ష్మి, దామోదరం రాధాక్రిష్ణ, పోతుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నా క్యాంటీన్ల పరిసరాలను శుభ్రంగా ఉంచండి

- కలెక్టర్ డాక్టర్ సిరి



కమిషనర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

కర్నూలు(సెంట్రల్): మునిసిపాలిటీల్లో అమలవుతున్న అన్నా క్యాంటీన్ల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని కలెక్టర్ డాక్టర్ సిరి మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆమె క్యాంపు కార్యాలయంలో అన్నా క్యాంటీన్లలో శానిటేషన్ నిర్వహణపై కమిషనర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అన్నా క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు భోజనం రుచికరంగా ఉండాలన్నారు. ఇందులో ఏమైనా తేడాలు వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, అన్నా క్యాంటీన్ల పరిసరాలకు సంబంధించిన ఫోటోలను మునిసిపల్ కమిషనర్‌లు ఆదివారం ఉదయం 7 గంటల్లోపు తనకు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. బృందావన్ నగర్, జోహరాపురం ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగాలేదని, ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చేలా పనిచేయాలని కర్నూలు మునిసిపల్ కమిషనర్ పి.విశ్వనాథ్‌ను ఆదేశించారు. సమావేశంలో జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, ఎమ్మిగనూరు మునిసిపల్ కమీషనర్ గంగిరెడ్డి, కర్నూలు అడిషినల్ కమిషనర్ కృష్ణ పాల్గొన్నారు.

## పోరాటంతోనే కార్మికులకు వేతనాలు పెంచారు



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు మునెప్ప

కర్నూలు (హాస్పిటల్): ఏఐటీయూసీ పోరాటాల ఫలితంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు పెంచారని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉప కార్యదర్శి ఎస్.మునెప్ప అన్నారు. శనివారం ఆసుపత్రిలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలు, డిస్పెన్సరీల్లో పనిచేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులకు 18,600కు జీతం పెరిగిందని తెలిపారు. దీంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, వారాంతపు సెలవులు, ఆర్జిత సెలవులు, జాతీయ పండుగల సెలవులు అమలు చేయాలని, విధుల్లో ఉన్న కార్మికులందరినీ యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని, కాంట్రాక్టర్లను కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు ఎస్.నాగరాజు, జి.చంద్రశేఖర్, టి.రామాంజినేయులు, శ్రీరాములు, చిన్న ప్రభాకర్, జయమ్మ పాల్గొన్నారు.

### నేడు విజయ దశమి ఉత్సవం

కర్నూలు కల్చరల్: రాష్ట్ర సేవికా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు బుధవార పేటలోని కేశవ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో విజయ దశమి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు సమితి నగర కార్యవాహిక శ్రీలేఖ తెలిపారు. విద్యా నగర్ మాంటిస్సోరి ప్రైమరీ పాఠశాల కో ఆర్డినేటర్ కె. ప్రమీల ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యకారిణి బి.సుబ్బలక్ష్మయ్య ప్రధాన వక్తగా హాజరై ప్రసంగిస్తారని తెలిపారు.

### సచివాలయాల ఉద్యోగుల అంతర్గత బదిలీలు

కర్నూలు (టౌన్): సచివాలయాల ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేస్తూ నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 112 సచివాలయం (చల్లా కాంపౌండ్), 122 సచివాలయం (ఇన్‌చార్జ్, ధర్మపేట) వార్డు ఎమినిటీస్ కార్యదర్శి బి. ఉదయ్‌కుమార్‌ను రామలింగేశ్వర్ నగర్‌లోని 115కు బదిలీ చేశారు. అక్కడ పనిచేసే నవీనను ఆశోక్‌నగర్‌లోని 120 సచివాలయానికి, కొండారెడ్డి నగర్‌లోని 101లో పనిచేసే ఎం. లీలాధర్ రెడ్డిని 122 ధర్మపేటకు, 102లో పనిచేసే ఎస్. లక్ష్మీనారాయణకు 101కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

### ఇద్దరికి గాయాలు

పాణ్యం: మినీ ట్రాలీ టైర్ పేలడంతో అదుపు తప్పి ఆటోను ఢీకొన్న ఘటన మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద శనివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడినట్లు హైవే పెట్రోల్ సిబ్బంది తెలిపారు. వారి వివరాల మేరకు.. తమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీరెడ్డి ఆటోలో కూలీలను వదిలిపెట్టి రోడ్డుపై ఉండగా కర్నూలు నుంచి నంద్యాలకు వస్తున్న మినీ ట్రాలీ టైర్ పేలడంతో ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో లక్ష్మీరెడ్డితో పాటు ట్రాలీలోని నిజాముద్దీన్ గాయపడ్డాడు. హైవే సిబ్బంది క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తొలగించారు.

### గేదెను ఢీకొన్న కారు

పాణ్యం: మండలంలోని నెరవాడ మెట్ట వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో గేదె తీవ్రంగా గాయపడింది. మహారాష్ట్రకు చెందిన ఎంహెచ్ 44జెడ్ 8757 నంబర్ గల కారు తిరుపతి వెళ్తుండగా రోడ్డు దాటుతున్న బర్రెను ఢీకొంది. సమాచారం తెలుసుకున్న హైవే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. పశుసంచార వాహన సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గేదెకు చికిత్స అందించారు. గేదె తీవ్రంగా గాయపడడంతో తమ జీవనాధారం కోల్పోయామని రైతు గోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. కారు అధిక వేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.

## పాహిమాం.. పరమేశ్వరీ!



లలితా పీఠంలో సామూహిక పూజల్లో పాల్గొన్న భక్తులు



నాగులాపురం సుంకులా పరమేశ్వరి

కర్నూలు కల్చరల్: దశసరా శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శనివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. నగరంలోని అమ్మవారి ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. లలితా త్రిపురసుందరిగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. గీతా మందిరంలో వెంకటేశ్వర స్వామిగా, చిన్న అమ్మవారి శాలలో పద్మావతి వెంకటేశ్వర స్వామిగా, ఇస్కాన్‌లో వామనుడిగా, కల్లూరు కన్యకా పరమేశ్వరి ఆలయంలో రాజరాజేశ్వరి దేవిగా, ఆరోరానగర్ రాజరాజేశ్వరీ ఆలయం, నన్నూరు సరస్వతి ఆలయం, బండి మెట్ట అంబా భవాని ఆలయం, పెద్ద అమ్మవారి శాల, వన్ టౌన్ కాళికాంబ ఆలయం, సప్తగిరి నగర్ చౌడేశ్వరి దేవి ఆలయంలో లలితా త్రిపుర సుందరిగా అమ్మవారిని అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన దుర్గా మాత విగ్రహాలకు పూజలు చేశారు. ఆధ్యాత్మిక నృత్యాలు, భక్తి సంగీత కచేరీలు, సంకీర్తనలు, కోలాటం, చెక్క భజన, హరికథలు, నవరాత్రులపై ప్రవచనాలు జరిగాయి. ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



చిన్న అమ్మవారిశాలలో పద్మావతి వెంకటేశ్వర స్వామిగా..



కల్లూరు కన్యకా పరమేశ్వరి ఆలయంలో రాజరాజేశ్వరిగా..



వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయంలో..



పెద్ద అమ్మవారి శాలలో లలితా త్రిపుర సుందరిగా..



సప్తగిరి చౌడేశ్వరీ ఆలయంలో..



నన్నూరు సరస్వతి ఆలయంలో..

### టెర్రస్ గార్డెనింగ్‌లో డోన్ మహిళకు రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డుతో వాణిరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): టెర్రస్ గార్డెనింగ్‌లో అద్భుతంగా రాణిస్తున్న డోన్‌కు చెందిన చిన్నపరెడ్డిగారి వాణిరెడ్డి రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. ఏరువాక ఫౌండేషన్ అనే సంస్థ 2024 సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ వార్షిక అవార్డులను ప్రదానం చేసింది. మిద్దెతోటలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది మంది మహిళలు అవార్డులకు ఎంపికయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి వాణిరెడ్డికి అవార్డు లభించింది. ఆమె తన భర్త వేణుగోపాల్‌రెడ్డి సహకారంతో కొన్నేళ్లుగా మిద్దెతోటలో అద్భుతంగా రాణిస్తున్నారు. టెర్రస్ గార్డెన్‌లో కిచెన్ వ్యర్థాలతో కంపోస్టు ఎరువులు ఉత్పత్తి చేసుకొని వినియోగిస్తారు. చీడపీడలు కనిపిస్తే మజ్జిగలో ఇంగువ కలిపి పిచికారి చేసుకుంటారు.

## అర్హులందరికీ రుణ సౌకర్యం



సమావేశంలో మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు (టౌన్): అర్హులైన వీధి వ్యాపారులందరికీ రుణ సౌకర్యం కల్పిస్తామని నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్ అన్నారు. శనివారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో లోక్ కల్యాణ మేళా కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల ప్రకారం ఒక కుటుంబం- ఒక వ్యాపార వేత్తలో భాగంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వీధి వ్యాపారులకు మొదటి విడత రూ. 10 వేల నుంచి రూ.15 వేలకు రెండవ విడత రూ. 20 వేల నుంచి రూ. 25 వేలకు పెంచడం జరిగిందన్నారు. మెప్మా పీడీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. వీధి వ్యాపారులందరూ డిజిటల్ ఆర్థిక లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సకాలంలో రుణాలు చెల్లిస్తే 7 శాతం వడ్డీ రాయితీ ఉంటుందన్నారు. కర్నూలు నగరంలో కొత్తగా 10 వేల మంది వీధి వ్యాపారులను నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు పాల్గొన్నారు.